manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANAVISHWAM TELUGU DAILY

> మెరుగు పెట్టకుండా వజ్రానికి,
> కష్టాలు ఎదుర్కోకుండా
> మనిషికి గుర్తింపు రాదు
> - సర్వేపల్లి రాధాకృష్ణన్

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 29 | గురువారం, జూలై 16 2026 | పేజీలు - 8 | వెల : 5/-

## భవితకు 'ఫ్యూచర్' బాట!

- భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని అమెజాన్‌కు పిలుపు
- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** తెలంగాణను 2034 నాటికి అగ్రగామిగా నిలిపి, వన్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ముందడుగు వేసింది. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌కు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విశ్వనగరంగా రూపుదిద్దుకోబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రస్థానంలో ఈ డేటా సెంటర్ తొలి, అత్యంత కీలకమైన అడుగు అని అభివర్ణించారు.రాబోయే 14 ఏళ్లలో అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 58 వేల కోట్లు)

మిగతా 2లో...

### లారీలు పెట్టలేదు ... కోట్ల

## బిల్లులు క్లియర్!

### హన్మకొండ జిల్లా 'కమలాపూర్ సెక్టార్'లో భారీ రవాణా కుంభకోణం?

- లారీలు రాకుండానే పౌరసరఫరాల సంస్థ రికార్డుల్లో పరుగు
- రైతులే సొంత వాహనాల్లో ధాన్యం తరలింపు
- సీసీటీవీ ఫుటేజీలతో బయటపడే నిజాలు?




**హన్మకొండ, జూలై 15 (మన విశ్వం):** పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో 'కమలాపూర్ సెక్టార్'లో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వాస్తవానికి రైతులే తమ సొంత ట్రాక్టర్లు, ట్రాలీలు, ఇతర వాహనాల్లో ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించినప్పటికీ, అధికారిక రికార్డుల్లో మాత్రం ప్రైవేట్ లారీల ద్వారా రవాణా జరిగినట్లు నమోదు చేసి కోట్ల రూపాయల బిల్లులు చెల్లించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రాథమిక సమాచారం ప్రకారం దాదాపు 60శాతానికి పైగా ధాన్యం రైతులే స్వయంగా మిల్లులకు తరలించినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ అదే ధాన్యాన్ని లారీల్లో తరలించినట్లు చూపిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీ

మిగతా 2లో...

### ఎంబీబీఎస్ సీట్ల

## భారీ పెంపు

- వైద్య విద్యార్థులకు శుభవార్త..
- దేశవ్యాప్తంగా 9,911 కొత్త సీట్లు



**న్యూఢిల్లీ, జూలై 15 (మన విశ్వం):** వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2026--27 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను గణనీయంగా పెంచింది. గత ఏడాదితో పోలిస్తే సుమారు 7 శాతం మేర సీట్లు పెరగడంతో, జాతీయ


మిగతా 2లో...

### చిన్న రైస్ మిల్లర్లకు

## అండగా ఉంటాం

- చిన్న మిల్లర్లపై వేధింపులు ఆపాలి
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం కల్పించాలని డిమాండ్

పెద్ద, చిన్న మిల్లర్లకు సమాన న్యాయం చేయాలని ప్రభుత్వానికి సూచన



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత రాష్ట్రంలోని చిన్న రైస్ మిల్లర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. చిన్న రైస్ మిల్లర్లకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటిస్తూ, వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చిన్న రైస్ మిల్లర్ల ప్రతినిధులు ఆమెను కలిసి తమ సమస్యలను వివరించగా, అనంతరం మాట్లాడిన కవిత ప్రభుత్వం పెద్ద రైస్ మిల్లర్ల విషయంలో ఒక విధంగా, చిన్న మిల్లర్ల విషయంలో మరో విధంగా వ్యవహరిస్తోందని

మిగతా 2లో...

### కేంద్రంపై మహేశ్ కుమార్ గౌడ్

## నిప్పులు!

- విద్యా వ్యవస్థను పూర్తిగా వ్యాపారంగా మార్చేశారు
- పేపర్ లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు బుగ్గిపాలు
- కేంద్రంపై పోరాటానికి విద్యార్థులు తరలిరావాలి: టీపీసీసీ చీఫ్ పిలుపు
- బోయిన్‌పల్లిలో ఘనంగా 'ఛత్రోంకి గూంజ్' కార్యక్రమం




**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** "దేశంలో విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చేసిందని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఆరోపించారు. బుధవారం

మిగతా 2లో...

## బడిబాటలోనే ప్రగతి బాట!

- ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ భవిష్యత్తుకు పునాది
- ఆగస్టు 15లోగా 27.50 లక్షల మందికి విద్యా కిట్లు
- కార్పొరేట్ బడులకు ధీటుగా తీర్చిదిద్దుతాం
- కొత్తకోటలో బాలికల పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి



**వనపర్తి, జూలై 15 (మన విశ్వం):** "పలుగూ పారా పట్టిన చేతులే రేపు కలాలు పట్టి తెలంగాణ భవిష్యత్తును సరికొత్తగా నిర్మించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులే రేపటి పునర్నిర్మాణంలో కీలక శిల్పు లు కావాలి" అని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపుని చ్చారు. చదువే సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందని,

మిగతా 2లో...

### జీవోలను దాచేస్తూ కోర్టు ధిక్కరణకు

## పాల్పడుతున్నారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎస్సీ ఎస్టీ కమీషన్
- మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం
- పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది కేవలం 3,290 మాత్రమే
- సచివాలయం దళారులకు అడ్డాగామారింది..
- తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం



**హైదరాబాద్, జులై 15(మన విశ్వం):** రాష్ట్రంలో ప్రజా పాలన సాగిస్తున్నామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం జీవోలను దాచిపెడుతూ కోర్టు ధిక్కరణకు పాల్పడుతోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమ ర్శించారు. బుధవారం ఆయన తెలం గాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సచివాలయం నేడు పైరవీకా రులకు, దళారులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. ల్యాండ్ సెటిల్‌మెంట్ అగ్రిమెంట్ల కోసమే సచివాలయంలో రహస్యంగా జీవోలు తెస్తున్నారని, ఈ జీవోలు ఎక్కడికి వెళ్తున్నాయో అడిగే దమ్ము ఇక్కడి అసమర్థ మంత్రులకు

మిగతా 2లో...

### ఉద్యమకారుల సంక్షేమంపై

## కసరత్తు

- ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రతినిధులతో కమిటీ ముఖాముఖి
- సీఎం రేవంత్‌రెడ్డికి సమగ్ర నివేదిక: కేకే



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** తెలంగాణ మలిదశ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తన కసరత్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా బుధవారం నగరంలోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన ఉద్యమకారులతో కమిటీ ముఖాముఖి సమావేశం నిర్వహించింది. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు,

మిగతా 2లో...

# సంపాదకీయం



## నదుల అనుసంధానమే పరిష్కారం

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్ధతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్దం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది.వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

## భవితకు

పెట్టుబడులు పెట్టనుందని సీఎం తెలిపారు. ఇదే జోరుతో తెలంగాణపై నమ్మకంతో 2034 నాటికి తమ పెట్టుబడులను రూ. లక్ష కోట్లకు పెంచాలని ఆయన అమెజాన్ ప్రతినిధులను కోరారు. ఇందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని, పెట్టుబడుల పురోగతిని ప్రతి నెలా తానే స్వయంగా పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు.

మూడు మండలాలుగా విభజన.. ఇదీ ప్రణాళిక!

రాష్ట్ర సమగ్ర వికాసం కోసం పారిశ్రామిక రంగాన్ని మూడు మండలాలుగా (త్రీ జోన్స్) వర్గీకరించి సరికొత్త కార్యాచరణను రూపొందించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

తెలంగాణ అభివృద్ధి 'త్రిశూలం'

1. ఓ ఆర్ ఆర్ లోపలి ప్రాంతం- సేవా రంగం
2. ఓ ఆర్ ఆర్ - ట్రిపుల్ ఆర్ మధ్య ప్రాంతం- తయారీ రంగం
3. ట్రిపుల్ ఆర్ అవతలి ప్రాంతం- వ్యవసాయ ఆధారితం

లక్ష్యం.. దేశ జీడీపీలో పది శాతం!

"దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5 శాతమే. కానీ దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)కి మనం అందిస్తున్న వాటా ఐదు శాతం. దీనిని 2047 నాటికి పది శాతానికి పెంచడమే మా సంకల్పం" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అప్పటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చుతామన్నారు. ఇందుకోసం సింగిల్ విండో విధానంలో వేగంగా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్' గ్లోబల్ సదస్సుకు 108 దేశాల ప్రతినిధులను, 3 వేలకు పైగా కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించడం కూడా ఫార్చ్యూన్-500 సంస్థలను ఆకర్షించే వ్యూహంలో భాగమేనని వివరించారు.

కాలుష్య రహిత 'మూసీ'.. గ్రీన్ హైదరాబాద్

హైదరాబాద్‌ను పర్యావరణహిత మహానగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలిస్తున్నామని, మూసీ నది ప్రక్షాళనను వేగవంతం చేశామని చెప్పారు. నగరంలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నామని, విద్యుత్ వాహనాలకు పన్ను మినహాయింపులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

రైతుల త్యాగం అమూల్యం!

'పరిశ్రమలు, నగరాభివృద్ధి కోసం భూములు ఇస్తున్న రైతుల త్యాగాన్ని ఈ ప్రభుత్వం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. వారికి మరింత మెరుగైన నష్టపరిహారం అందించి, అండగా ఉంటాం. నీరు, నిధులు, నిరంతర విద్యుత్, నైపుణ్యం కలిగిన యువతే పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా మార్చబోతున్నాయి." - ఎ. రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి

## లారీలు పెట్టలేదు ...

నష్టం కలిగించారనిఆరోపిస్తున్నారు.

సీసీటీవీ ఫుటేజీల్లో బయటపడే నిజాలు?

'కమలాపూర్ సెక్టార్' పరిధిలోని రైస్‌మిల్లుల్లో ఉన్న సిసిటివి కెమెరాల ఫుటేజీ లను పరిశీలిస్తే రికార్డుల్లో చూపించిన స్థాయిలో లారీలు రాకపోకలు సాగించలేదని తెలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ధాన్యం రవాణా జరగకుండానే బిల్లులు ఎలా క్లియర్ అయ్యాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఈ వ్యవహారం వెనుక పౌరసరఫరాల శాఖలోని ఒక కీలక అధికారి పాత్ర ఉందని, ఆయన బినామీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా'వెంకటేశ్వర లారీ ట్రాన్స్పోర్ట్ పేరుతో అక్రమంగా లారీల్లో ధాన్యం తరలించకున్నా కోట్ల రూపాయల చెల్లింపులు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

సీజన్‌ల వారీగా చెల్లింపుల వివరాలు

2024-25 ఖరీఫ్ సీజన్... ఈ సీజన్ కు సంబంధించి వెంకటేశ్వరా లారీ ట్రాన్స్పోర్ట్ మొత్తం ధాన్యం 35,246.680 మెట్రిక్ టన్నులు తరలించినట్లు నమోదు చేయగా అందుకుగాను మొత్తం బిల్లు రూ.1,50,71,338.54(కోటి యాభై లక్షల డెబ్బై ఒక వేల మూడు వందల ముప్పై ఎనిమిది రూపాయలు )చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.1,41,72,404(ఒక కోటి నలభై ఒక లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల నాలుగు రూపాయలు )చెల్లించారు.ఇంకా రూ.6,09,702 (ఆరు లక్షల తొంబై ఏడు వేల రెండు రూపాయలు )చెల్లించాల్సి ఉన్నట్టు తెలుస్తుంది.

2024-25 రబీ సీజన్...

ఈ సీజన్ కు సంబందించి వెంకటేశ్వరా లారీ ట్రాన్స్పోర్ట్ మొత్తం ధాన్యం 33,333.640 మెట్రిక్ టన్నులు తరలించినట్లు పౌరసరఫరాల సంస్థ రికార్డుల్లో నమోదు చేశారు.అందు కుగాను మొత్తం బిల్లు రూ.1,43,19,376.56(ఒక కోటి నలభై మూడు లక్షల పంతొమ్మిది వేల మూడు వందల డెబ్బై ఆరు రూపాయలు ) చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.1,34 ,58,760.61 (ఒక కోటి ముప్పై నాలుగు లక్షలయాభై ఎనిమిది వేల ఏడు వందల అరవై రూపాయలు)చెల్లించారు. ఇంకా రూ.5,85,947.37(ఐదు లక్షల ఎనభై ఐదు వేల తొమ్మిది వందల నలభై ఏడు రూపాయలు ) చెల్లించాల్సి ఉందని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

2025-26 ఖరీఫ్ సీజన్... ఈ సీజన్ లో వెంకటేశ్వరా లారీ ట్రాన్స్పోర్ట్ మొత్తం ధాన్యం 43,191 మెట్రిక్ టన్నులు తరలించినట్లు రికార్డ్ నమోదు చేయగా ఇంకా మొత్తం బిల్లు పూర్తికాలేదని ఇప్పటివరకు

రూ. 1,00,05,800(ఒక కోటి ఐదు వేల ఎనిమిది వందలు )బిల్లు చెల్లించినట్లు తెలిసింది.

2025-26 రబీ సీజన్...

ఈ సీజన్ లో వెంకటేశ్వరా లారీ ట్రాన్స్పోర్ట్ మొత్తం ధాన్యం 35,755 మెట్రిక్ టన్నులు తరలించినట్లు రికార్డులో నమోదు చేయగా ఇంకా మొత్తం బిల్లు పూర్తికాలేదని ఇప్పటివరకు రూ.63,30,800(అరవై మూడు లక్షల ముప్పై వేల ఎనిమిది వందలు )చెల్లించినట్లు పౌరసరఫరాల సంస్థ రికార్డులు చెప్తున్నాయి.

ఇంకా పెండింగ్ బిల్లుల రూపంలో రూ. 1 కోటి నుండి రూ. 2కోట్ల వరకు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి?

మిల్లుల సీసీటీవీ ఫుటేజీలు, వెయ్‌బ్రిడ్జ్ రికార్డులు, జీపీఎస్ వివరాలు, ఈ-వే బిల్లులు, రైతుల వాంగ్మూలాలు, రవాణా రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలిస్తే ధాన్యం నిజంగా లారీల్లో తరలించారా? లేక కాగితాల్లోనే రవాణా చూపించి ప్రభుత్వ సొమ్మును దోచుకున్నారా? అనే అంశం తేలిపోతుందని స్థానిక రైతులు అంటున్నారు.

రైతుల కష్టార్జిత ధాన్యం పేరుతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలపై ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కేంద్రంపై మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో నిర్వహించిన "ఛత్రోంకి గూంజ్" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఆందోళనలో యువత.. భరోసా ఎక్కడ?

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అయితే, కేంద్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం వ్యాపార దృక్పథంతోనే వ్యవహరిస్తోందని విమర్శించారు. నేడు దేశంలో విద్యా, ఉద్యోగ అవకాశాల విషయంలో యువత తీవ్ర ఆందోళనలో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు."పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైంది. వరుస పేపర్ లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయి. విద్యా వ్యవస్థపై యువత నమ్మకం కోల్పోయేలా కేంద్రం వ్యవహరిస్తోంది."అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

రాజీనామా చేయని ధర్మేంద్ర ప్రధాన్!

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై పరీక్షల లీకేజీలకు సంబంధించి తీవ్ర ఆరోపణలు వచ్చినప్పటికీ, ఆయన బాధ్యత వహించి రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. పైగా కేంద్ర ప్రభుత్వం కూడా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రక్షించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యల పట్ల కేంద్రానికి ఏమాత్రం పట్టింపు లేదని ధ్వజమెత్తారు.

రాహుల్ గాంధీ బాటలో పోరాడుదాం..

విద్యార్థుల హక్కులను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ ఉద్యమాన్ని ప్రారంభించారని నాయకులు స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాల అంశాల్లో యువతకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగేది లేదని తేల్చిచెప్పారు.

## బడిబాటలోనే ప్రగతి బాట!

కుటుంబాల రాతను మారుస్తుందని ఆయన ఆకాంక్షించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

రూ.1,000 కోట్లతో విద్యా కిట్లు

ప్రభుత్వ బడులలో చదువుతున్న 27.50 లక్షల మంది విద్యార్థులకు రాబోయే ఆగస్టు 15వ తేదీ లోగా సుమారు రూ.1,000 కోట్లకు పైగా వ్యయంతో తొమ్మిది రకాల వస్తువులతో కూడిన 'తెలంగాణ విద్యా కిట్లను' అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. "ఈ కిట్ల నాణ్యత ఎలా ఉందనే అంశంపై విద్యార్థుల నుంచే నేరుగా వాట్సాప్ ద్వారా అభిప్రాయాలు సేకరించేలా సరికొత్త విధానాన్ని తీసుకువస్తున్నాం" అని వెల్లడించారు. గత ప్రభుత్వాల హయాంలో మౌలిక వసతుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేసిన సీఎం.. కార్పొరేట్ బడులకు ఏమాత్రం తీసిపోని విధంగా సర్కారు బడులను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల కృషి అమోఘం

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఉపాధ్యాయులను వేధిస్తున్న సమస్యలపై దృష్టి సారించామని సీఎం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను విజయవంతంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. "కుటుంబాలను విడదీసిన 317 జీవో సమస్యను పరిష్కరించి బడుల్లో అనుకూల వాతావరణాన్ని కల్పించాం. గురువుల శ్రమ ఫలితంగానే కేంద్ర పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ సూచీలో మన రాష్ట్రం 36వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎగబాకింది. భవిష్యత్తులో మొదటి రెండు స్థానాల్లో నిలిచేలా మరింతగా కృషి చేయాలి" అని ఉపాధ్యాయులను కోరారు.

అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు

ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను పరిశీలించేందుకు ఇప్పటికే 50 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను విదేశాలకు పంపామని, వచ్చే ఏడాది మరో 150 మందిని పంపనున్నట్లు సీఎం వెల్లడించారు. కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంతో ఉద్యోగ మార్కెట్ మారుతోందని, విద్యార్థులు జర్మన్, జపనీస్ వంటి అంతర్జాతీయ భాషలను నేర్చుకుని అంతర్జాతీయ అవకాశాలను ఒడిసిపట్టాలని సూచించారు.

ఒక్కొక్కరిపై రూ.1.08 లక్షల వ్యయం "ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై సర్కారు ఏటా సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలి. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకూ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుంది. భవిష్యత్తులో మన బడుల నుంచే గొప్ప శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు తయారుకావాలి" అని సీఎం ఆకాంక్షించారు.

## జీవోలను దాచేస్తూ కోర్టు ధిక్కరణకు

లేదని దుయ్యబట్టారు. 15,774 జీవోలు ఎక్కడ?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి (2023 డిసెంబరు 7 నుంచి 2025 జనవరి 25 వరకు) మొత్తం19,064జీవోలు జారీ చేయగా.. కేవలం 3,290 జీవోలను మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉంచిందని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మిగిలిన 15,774 జీవోలను ఎందుకు దాచిపెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు."అన్ని జీవోలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని మేము కోర్టుకు వెళ్లగా.. ఎనిమిది వారాల్లోగా వెబ్‌సైట్‌లో పెట్టాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా ప్రభుత్వం ఆ ఉత్తర్వులను అమలు చేయకుండా కోర్టులను కించపరుస్తోంది. అందుకే కోర్టు ధిక్కరణ కింద మళ్లీ పిటిషన్ వేశాం. గతంలో కేసీఆర్ హయాంలో జీవోలను దాస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు చేస్తున్నదేమిటి?" అని ప్రశ్నించారు.

వివిధ శాఖల్లో మాయమైన జీవోల వివరాలు

మహాత్మా గాంధీ, సోనియా గాంధీ ఆశయాలంటూ మాట్లాడే రేవంత్ సర్కార్.. సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించిన జీవోలను భారీగా దాచిపెట్టారని గణాంకాలను విడుదల చేశారు.ఎస్సీ సంక్షేమ శాఖలో ?జారీ చేసిన 259 జీవోల్లో కేవలం 4 మాత్రమే బయటపెట్టారు.

ఎస్టీ సంక్షేమ శాఖలో ?266 జీవోలు తెస్తే పబ్లిక్ డొమైన్‌లో ఉన్నది కేవలం 3 మాత్రమే.

బీసీ సంక్షేమ శాఖలో ?288 జీవోలకు గానూ 88 మాత్రమే వెబ్‌సైట్‌లో పెట్టారు.

మైనార్టీ సంక్షేమ శాఖ ?155 జీవోల్లో కేవలం 2 మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంచారు.సాధారణ పరిపాలన (జీఏడీ) ?లో 2,238 జీవోలకు గానూ కేవలం 89 మాత్రమే పబ్లిక్ డొమైన్ లో పెట్టారు.ఆరోగ్య శాఖలో ?1,048 జీవోలు జారీ చేసి.. కేవలం ఒక్క జీవోను మాత్రమే బయటపెట్టారని అన్నారు

అధికారులకు జైలు శిక్ష తప్పదు..

సమాచార హక్కు చట్టాన్ని గౌరవించి ప్రభుత్వం వెంటనే అన్ని జీవోలను బహిర్గతం చేయాలని, లేకపోతే ఇది ఇందిరమ్మ రాజ్యం కాదని, దొంగల రాజ్యంగా మారుతుందని హితవు పలికారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి చీకటి దందాకు సహకరిస్తున్న అధికారులే రేపు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. రేపు మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమేనని, తప్పు చేసిన ఏ ఒక్క అధికారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు

## ఉద్యమకారుల సంక్షేమంపై

డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మోతె శోభన్‌రెడ్డి, ఎస్.రాములు నాయక్ పాల్గొని వారి నుంచి వినతులను స్వీకరించారు.ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సరిహద్దు జిల్లాల్లో విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు సమిష్టిగా సాగించిన పోరాటమే తెలంగాణ ఆవిర్భావానికి బలమైన పునాది వేసిందని కమిటీ సభ్యులు కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరి సేవలను ప్రభుత్వం గుర్తించేలా కమిటీ పనిచేస్తుందని భరోసా ఇచ్చారు.ప్రధాన డిమాండ్లు ఇవే.. సొంత ఇల్లు లేని ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం కేటాయించాలని, జీవితకాల నెలవారీ పెన్షన్ అందించాలని ఉద్యమకారులు కోరారు. పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు, కేజీ టు పీజీ ఉచిత విద్య, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఆర్టీసీ బస్సుల్లో జీవితకాల ఉచిత ప్రయాణ సదు పాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యమకారులకు స్వయం ఉపాధి అవకాశాలు ఇవ్వాలన్నారు.

## ఎంబీబీఎస్ సీట్ల

అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ)లో అర్హత సాధించిన విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి.జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) విడుదల చేసిన వివరాల ప్రకారం, 2025--26లో దేశంలోని 818 వైద్య కళాశాలల్లో 1,28,976 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, 2026--27లో 823 కళాశాలల్లో మొత్తం 1,36,939 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఐదు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభం కావడంతో పాటు మొత్తం 9,911 కొత్త సీట్లు జతయ్యాయి.దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 823 వైద్య కళాశాలల్లో 441 ప్రభుత్వ, 382 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 63,296 సీట్లు ఉండగా, వాటిలో 2,111 కొత్త సీట్లు మంజూరయ్యాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లో మొత్తం 73,643 సీట్లు ఉండగా, కొత్తగా 7,800 సీట్లు పెరిగాయి. దీంతో వైద్య విద్యలో ప్రవేశాలు పొందే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## చిన్న రైస్ మిల్లర్లకు

ఆరోపించారు. పెద్ద రైస్ మిల్లర్లకు వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకుండా, రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు బకాయిలు ఉన్న చిన్న మిల్లర్లపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతుల నుంచి తరుగు పేరుతో 8 నుంచి 10 కిలోల వరకు ధాన్యం తగ్గించి భారీ అవకతవకలు జరిగాయని కవిత ఆరోపించారు. చిన్న మిల్లర్లపై చర్యల వల్ల గోదాముల అద్దెలు, వడ్డీ భారం పెరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కరీంనగర్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు కూడా ఈ పరిస్థితులే కారణమని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో దొడ్డు బియ్యాన్ని విదేశాలకు అధిక ధరకు విక్రయించగా, ప్రస్తుతం తక్కువ ధరకు విక్రయించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన కవిత, దీనికి సంబంధించిన టెండర్లలో కూడా అవకతవకలు జరిగాయని అన్నారు. ఈ అంశంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ బియ్యం తరలింపులు జరగడం వెనుక కారణాలపై సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పెద్ద రైస్ మిల్లర్లకు వర్తింపజేసిన షరతులనే చిన్న మిల్లర్లకూ వర్తింపజేయాలని, వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం కల్పించాలని కవిత కోరారు.

# సీసీఐ పునరుద్ధరణకు కేటీఆర్ వినతి

- అదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణకు కేంద్రం వద్ద కేటీఆర్ విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి కుమారస్వామితో ఢిల్లీలో భేటీ
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ, జూలై 15 (మన విశ్వం):** అదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో సమావేశమై సీసీఐ పునరుద్ధరణ అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలోని



సీసీఐ పునరుద్ధరణ సంయుక్త చర్యల కమిటీ ప్రతినిధులు, రాజ్యసభలో బీఆర్ఎస్ పక్షనేత వద్దిరాజు రవిచంద్ర కూడా పాల్గొన్నారు. అదిలాబాద్ ప్రాంత పారిశ్రామికాభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం సీసీఐ కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

సీసీఐ కర్మాగారం పునఃప్రారంభమైతే వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించడంతో పాటు అదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని ప్రతినిధులు వివరించారు. కర్మాగార పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రతినిధుల వినతిపై కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి సానుకూలంగా స్పందించినట్లు కేటీఆర్ తెలిపారు. సీసీఐ పునరుద్ధరణ ప్రతిపాదనకు తన మద్దతు ఉంటుందని, ఈ అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సహకరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.అదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణ కోసం అన్ని స్థాయిల్లో కృషి కొనసాగిస్తామని, పరిశ్రమ తిరిగి ప్రారంభమయ్యేలా కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ చర్యతో ప్రాంత ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలకు సీఎంసీ కఠిన ఆదేశాలు

- నిబంధనలు పాటించని హోటళ్ల తొలగింపునకు సూచన
- హెచ్-ఫాస్ట్‌తో కల్తీ ఆహారంపై ఉక్కుపాదం

**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే నాణ్యతలేని హోటళ్లకు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వేదికల్లో చోటు ఉండకూడదని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. పరిశుభ్రత పాటించని, సరైన చిరునామా లేని, చెల్లుబాటు అయ్యే లైసెన్సులు లేని హోటళ్లను వెంటనే తమ వేదికల నుంచి తొలగించాలని జొమాటో, స్విగ్గీ సంస్థలకు కమిషనర్ జి. సృజన నోటీసులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాజీ పడబోమని స్పష్టం చేస్తూ నాణ్యత ప్రమాణాల అమలుపై కఠిన చర్యలు ప్రారంభించారు. సైబరాబాద్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాయా అనే అంశంపై గత నెల రోజులుగా ముమ్మర తనిఖీలు కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్ డెలివరీ సంస్థలు కూడా బాధ్యత వహించాలని భావించిన కమిషనర్ సృజన, స్విగ్గీ, జొమాటో ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అడ్రస్ లేని, పరిశుభ్రత లేని, లైసెన్సు గడువు ముగిసిన హోటళ్లను వెంటనే ఆన్‌లైన్ జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. ఆహార భద్రతకు



విఘాతం కలిగించే సంస్థలకు ఎలాంటి ప్రోత్సాహం ఉండదని హెచ్చరించారు.ఇటీవల కూకట్‌పల్లి బాగ్‌అమీర్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్ వంటగదిలో పిల్లులు సంచరిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అధికారులు అక్కడ తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన లైసెన్సు, పాడైపోయిన ఆహార పదార్థాలు, ఎలుకలు, బొద్దింకల మధ్య వంటలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వంటగది అత్యంత దయనీయ స్థితిలో ఉండటంతో సంబంధిత హోటల్‌కు నోటీసులు జారీ చేశారు. అనంతరం జొమాటో తన ఆన్‌లైన్ వేదిక నుంచి ఆ హోటల్‌ను పూర్తిగా తొలగించింది. జీహెచ్ఎంసీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు ఉన్న హోటళ్లకే ఆన్‌లైన్ వేదికల్లో అవకాశం కల్పించాలని కమిషనర్ సూచించారు. లైసెన్సు గడువు ముగిసిన వెంటనే వాటి వివరాలను తొలగించాలని ఆదేశించారు. ప్రతి హోటల్, క్లౌడ్ కిచెన్‌కు స్పష్టమైన చిరునామా, గూగుల్ లొకేషన్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సీఎంసీ తనిఖీల్లో ఇచ్చే రేటింగ్‌లను నిరంతరం పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. ప్రస్తుతం తమ వేదికల్లో నమోదైన హోటళ్ల పూర్తి జాబితాను అందజేయడంతో పాటు వారం రోజుల్లో ఫిర్యాదులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఇక కల్తీ ఆహార నియంత్రణ కోసం హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్-ఫాస్ట్ ప్రత్యేక బృందం విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తోంది. కల్తీ లేని నాణ్యమైన ఆహారం పొందడం ప్రతి పౌరుడి హక్కు అని టాస్క్‌ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు. గత వంద రోజుల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 185 కేసులు నమోదు చేసి సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు కొత్త వ్యూహం

- టీఎమ్ఏఆర్ఎస్, టాడాస్క్ పురోగతిపై డీజీపీ సమీక్ష
- విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను ఆధునికీకరించడంతో పాటు మాదకద్రవ్యాల నియంత్రణను మరింత పటిష్ఠం చేసేందుకు తెలంగాణ పోలీసులు కీలక చర్యలు చేపడుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత బ్యూరోతో పాటు అన్ని విద్యాసంస్థల్లో తెలంగాణ మాదకద్రవ్యాల నిరోధక, భద్రత కమిటీల ఏర్పాటుపై రాష్ట్ర డీజీపీ బుధవారం సమీక్ష నిర్వహించారు. గత కొన్ని నెలలుగా ఈ రెండు వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే పూర్తి స్థాయిలో అమల్లోకి రానున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణలో ఏకరీతి విధానాలను అమలు చేయడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత బ్యూరోను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై హైవే పెట్రోలింగ్‌ను బలోపేతం చేయడంతో పాటు ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, కొత్త సిగ్నళ్ల ఏర్పాటు, రహదారి



సూచిక బోర్డులు, ట్రాఫిక్ మౌలిక వసతుల అభివృద్ధి వంటి బాధ్యతలను ఈ వ్యవస్థ నిర్వహించనుందని చెప్పారు.

విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ మాదకద్రవ్యాల నిరోధక, భద్రత కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ తెలిపారు. విద్యార్థుల్లో అనుమానాస్పద ప్రవర్తన కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించే బాధ్యత విద్యాసంస్థలపై ఉంటుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల నుంచి అఫిడవిట్లు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ భద్రత సమన్వయకర్తలను నియమించి పోలీసులతో సమన్వయం చేస్తారని డీజీపీ తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు ర్యాగింగ్, విద్యార్థినుల గౌరవానికి భంగం కలిగించే ఘటనలు, ట్రాఫిక్ అవగాహన వంటి అంశాలపై కూడా ఈ కమిటీలు ప్రత్యేకంగా దృష్టి సారించనున్నాయని చెప్పారు. నిబంధనలను అమలు చేయని విద్యాసంస్థలపై బాధ్యత నిర్ణయించే విధానం కూడా అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

భవిష్యత్ తరాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడకపోతే ఈ పోరాటంలో విజయం సాధించడం కష్టమని డీజీపీ స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసినప్పుడే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజ భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కొత్త వ్యవస్థల అమలుతో రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత సమర్థవంతం కావడంతో పాటు విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు బలమైన యంత్రాంగం ఏర్పడుతుందని పోలీసు శాఖ భావిస్తోంది. ప్రజల సహకారంతో రోడ్డు భద్రత, యువత భవిష్యత్తు పరిరక్షణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు కొనసాగనున్నాయి.

# ద్వంద్వ ఓటు హక్కుపై విచారణ జరపాలి

- ముఖ్యమంత్రిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణలు
- ఎన్నికల సంఘాన్ని కలుస్తామని ప్రకటన



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వంద్వ ఓటు హక్కు కలిగి ఉన్నారంటూ బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరపాలని డిమాం డ్ చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండడం నేరమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కొడంగల్, కొండారెడ్డిపల్లి ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారని ఆయన ఆరోపించారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో దాఖలు చేసిన అఫిడ విట్‌లో ఈ విషయాన్ని అధికారులకు వెల్లడించారా అని ప్రశ్నించారు. ఒకవేళ కొండారెడ్డిపల్లి ఓటు తొలగించి ఉంటే, అందుకు సంబంధించిన దరఖాస్తుపై ముఖ్యమంత్రి సంతకం చేశారా అనే విషయాన్ని కూడా వెల్లడించాలని కోరారు.

ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పందించడం లేదని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఈ అంశంలో వాస్తవ నిర్ధారణ సంస్థ జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. తొలుత ఇచ్చిన వివరణను తర్వాత తొలగించడం వెనుక కారణాలను కూడా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశ్ రాజ్, మీనాక్షి నటరాజన్ వ్యవహారాల్లో ఒక విధంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చట్టం ముందు అందరూ సమానమేనని పేర్కొంటూ రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాన్ని ప్రస్తావించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ మీడియాను బెదిరించారంటూ కూడా ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో కొడంగల్ అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయాలని, ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై త్వరలోనే బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేదా సంబంధిత అధికారుల నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఎన్నికల సంఘం వైఖరిపై కూడా ఆసక్తి నెలకొంది.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేకు సన్నాహాలు



- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన
- పాదచారుల భద్రతకు ప్రత్యేక చర్యలు

**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు క్షేత్రస్థా యిలో పరిశీలన నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సమీక్ష చేశారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు అధికారులు కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన తిరుగుతూ ప్రధాన జంక్షన్లను పరిశీలించారు. అగ్రసేన్ కూడలి, ఫిలింనగర్, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్--45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ప్రధాన ద్వారం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి, వాహనాల రాకపోకలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన వన్‌వే ప్రయోగాత్మక అమలులో ఎదురైన సమస్యలపై అధికారులు చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని గుర్తించి, ఆయా ప్రాంతాల్లో వెంటనే రహదారి విస్తరణ పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. వన్‌వే అమలుకు అవసరమైన చిన్నపాటి పౌర నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచిం చారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని పనుల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాదచారుల భద్రత కోసం పెలికాన్ సిగ్నల్స్, లేన్ మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని, పార్కు అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. నగర పోలీసు శాఖ సూచించిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు ప్రయా ణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనులు జరిగే సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్, ట్రాఫిక్ డీసీపీ కాజల్‌తో పాటు జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో శాశ్వత పరిష్కారాలు అమలు చేసి నగరవాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఏసీబీ వలలో భూగర్భ జలాల అధికారి

- రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టివేత
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో కలిసి అరెస్టు


**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** సూర్యాపేట జిల్లా భూగర్భ జలాల శాఖలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన వలలో జిల్లా భూగర్భ జలాల అధికారి మేఘావత్ బాలు, ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లు చిక్కారు. బోరు బావి తవ్వకాలకు అధికారిక అనుమతి మంజూరు చేయడం, అలాగే రిగ్‌ను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఏసీబీ వివరాల ప్రకారం, జిల్లా భూగర్భ జలాల అధికారి మేఘావత్ బాలు తన తరఫున ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లుతో ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకునే ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో కోసనోజు వెంకటేశ్వర్లు రూ.20 వేల నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి నగదుతో పాటు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రధాన నిందితుడు మేఘావత్ బాలును కూడా అరెస్టు చేశారు.

లంచంగా తీసుకున్న రూ.20 వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరు నిందితుల అధికారిక విధుల నిర్వహణలో అవకతవకలు జరిగాయా అనే కోణంలో వారి కార్యాలయాలు, ఇతర సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహి ంచారు. ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేసి అక్రమంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు



ఏసీబీ వెల్లడించింది. ఈ కేసులో అరెస్టు చేసిన జిల్లా భూగర్భ జలాల అధికారి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని, అవసరమైతే మరిన్ని ఆధారాలు సేకరిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అధికారిక విధుల నిర్వహణ కోసం లంచం డిమాండ్ చేసినా లేదా స్వీకరించినా ప్రజలు వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వాట్సాప్ 94404 46106, తెలంగాణ ఏసీబీ అధికారిక సామాజిక మాధ్యమాల వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యా దుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ పేర్కొంది. ప్రజలు లంచం ఇవ్వకుండా చట్టబద్ధంగా ఫిర్యాదు చేసి అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

## పిల్లలకు ఆ వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు అయ్యేలా నేర్పించాలి..



బాల్యంలో అలవాటు అయ్యే జీవనశైలి, వ్యక్తి భవిష్యత్ ఆరోగ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. చిన్నతనంలో నేర్చుకున్న ఆహారపు అలవాట్లు, నిద్ర విధానం, శారీరక చురుకుదనం, రోజువారీ క్రమశిక్షణ వంటి అంశాలు పెద్దయ్యాక కూడా కొనసాగుతాయి. పిల్లలు తల్లిదండ్రులు చెప్పే మాటల కంటే వారు చేసే పనుల నుంచే ఎక్కువగా నేర్చుకుంటారని నిపుణులు చెబుతున్నారు. అందుకే చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన అలవాట్లను కుటుంబంలో భాగం చేయడం పిల్లల దీర్ఘకాల ఆరోగ్యానికి పెట్టుబడిగా భావించవచ్చు. పిల్లలకు చిన్న వయసులోనే ఈ-సిగరెట్లు (వేప్స్) వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని నేర్పించడం చాలా అవసరం. ప్రస్తుతం యువతలో వేపింగ్ వినియోగం పెరుగుతున్నప్పటికీ, అవి సురక్షితమైనవి అనే అభిప్రాయం తప్పుదారి పట్టించేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి ఊపిరితిత్తుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు.డిజిటల్ తెరలకు దూరంగా..ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లలు కాస్త ఖాళీగా ఉన్నా వెంటనే మొబైల్, టాబ్లెట్ లేదా ఇతర స్క్రీన్‌లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే అప్పుడప్పుడు బోర్‌గా అనిపించడం కూడా అవసరమేనని నిపుణులు సూచిస్తున్నారు.

# మెట్రో సేవల విస్తరణకు కార్యాచరణ

- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలపై దృష్టి
- అదనపు బోగీల ఏర్పాటుకు చర్యలు
- చివరి మైలు అనుసంధానం బలోపేతం




**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** హైదరాబాద్ మెట్రో రైలు సేవలను మరింత అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కొత్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మెట్రో మార్గాల నిర్వహణ, అభివృద్ధిపై వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. మొదటి దశలో నిర్మించిన 69 కిలో మీటర్ల మెట్రో మార్గాల్లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, చివరి మైలు రవాణా అనుసంధానం, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, స్టేషన్ల పరిశుభ్రత, రద్దీ నిర్వహణ అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అజిత్ రెడ్డి సూచించారు. ఇందుకోసం తయారీ సంస్థలతో చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే మెట్రో స్టేషన్ల నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా చివరి మైలు రవాణా సేవలను మరింత విస్తరించాలని, రవాణా సంస్థలతో సమన్వయం పెంచాలని తెలిపారు. మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న ఆకాశ మార్గాల నిర్వహణ, విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్ల మధ్య అనుసంధాన మార్గాలను మరింత సులభతరం చేసి ప్రయాణికులు గందరగోళం లేకుండా వేదికలకు చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి మెట్రో స్టేషన్‌కు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ముందుగా కొన్ని స్టేషన్లలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని తెలిపారు.

హైటెక్ సిటీ, రాయదుర్గం, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్ వంటి అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రజా వేగవంత రవాణా వ్యవస్థ ప్రతిపాదనల పురోగతిని కూడా సమీక్షించారు. ప్రయాణికుల భద్రత కోసం మెట్రో భద్రతా విభాగం అమలు చేస్తున్న చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించి, అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని సూచించారు. సమీక్ష సమావేశంలో సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో పాటు వివిధ విభాగాల ప్రధాన ఇంజినీర్లు, జనరల్ మేనేజర్లు, భద్రతా విభాగ అధికారులు పాల్గొన్నారు. మెట్రో స్టేషన్ల నిర్వహణను త్వరలో క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి సేవల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటానని అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి తెలిపారు.

# అంగన్‌వాడీలపై సీతక్క సమీక్ష

- 'తొలిముద్ద' అమలుకు ఆదేశాలు
- గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి
- సంక్షేమ పథకాల అమలు వేగవంతం



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** మహిళా, శిశు సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న మహిళా, శిశు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించిన మంత్రి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీల్లో అమలవుతున్న 'తొలిముద్ద' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో నాణ్యమైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు, పప్పు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఇంటికి తీసుకెళ్లే పోషకాహార పంపిణీని వేగవంతం చేసి అర్హులందరికీ సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అనుకూలమైన వాతావరణంలో సేవలు అందించేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఇందుకోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని, ప్రతి అర్హ లబ్ధిదారునికి ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

# ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన కేంద్రం

- విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథమే లక్ష్యం
- అల్వాల్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు




**మల్కాజిగిరి, జూలై 15 (మన విశ్వం ):** మల్కాజిగిరిలోని అల్వాల్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. చిన్న వయసు నుంచే విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రయోగాలు చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. ఇటువంటి విజ్ఞాన కేంద్రాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విజ్ఞాన కేంద్రం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలను నేర్చుకునే అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, విజయేంద్ర ప్రసాద్, ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ నారాయణ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సహకరించిన సంస్థ ప్రతినిధులను అభినందిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన అతిథులు అక్కడ ఏర్పాటు చేసిన పరికరాలు, విద్యా నమూనాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆసక్తులను తెలుసుకున్నారు. విజ్ఞానాన్ని అన్వేషించే తపనతో ముందుకు సాగాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి సూచించారు. ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాలు మరింత పెంపొందుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విద్యా సంస్థలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# సీతమ్మసాగర్ అనుమతులకు వేగం

- సీతారామ ప్రాజెక్టు పనులపై మంత్రుల సమీక్ష
- రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో భేటీ అయిన ఆయన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. న్యాయపరమైన చిక్కులు తొలగి అనుమతులు లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటంతో 2023 మార్చి నుంచి పనులు నిలిచిపోయాయని మంత్రి గుర్తు చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర మంత్రులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతాంగానికి శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్ హౌస్-1, పంప్ హౌస్-2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై కూడా మంత్రులు చర్చించారు. నిల్వ సామర్థ్యం పెరిగితే ఎత్తిపోతల పథకం మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని తుమ్మల వివరించారు. అలాగే ప్రధాన కాలువపై అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు ద్వారా వరద సమయంలో కాలువలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. 2026 ఆగస్టు నాటికి ఈ పనులు పూర్తిచేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని వెల్లడించారు. సొరంగ నిర్మాణానికి సంబంధించిన బిల్లులను త్వరగా విడుదల చేసి పనులు మరింత వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పరిహారాన్ని త్వరితగతిన చెల్లించాలని మంత్రి తుమ్మల కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగును దృష్టిలో ఉంచుకుని పైపుల ద్వారా సాగునీటి పంపిణీ సాధ్యాసాధ్యాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ విధానం ద్వారా రైతులకు మరింత సమర్థవంతంగా నీటి సరఫరా చేయవచ్చని అభిప్రాయపడ్డారు. జూలూరుపాడు సొరంగం నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. పాలేరు జలాశయానికి త్వరగా నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను సమన్వయంతో పరిష్కరించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇరువురు మంత్రులు పునరుద్ఘాటించారు.

# తెలంగాణ రక్షణ సేనలో బీసీలకు ప్రాధాన్యం

- 23 నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల ప్రకటన
- పార్టీ బలోపేతంపై కవిత దిశానిర్దేశం




**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను ప్రకటించారు. ఈ నియామకాల్లో బీసీ నాయకులకు అధిక ప్రాధాన్యం కల్పించారు. ప్రకటించిన 23 స్థానాల్లో 12 స్థానాలను బీసీ నేతలకు కేటాయించగా, ఐదుగురు ఎస్సీ నాయకులు, ఒక ఎస్టీ నాయకుడికి అవకాశం ఇచ్చారు. మిగిలిన ఆరు స్థానాల్లో ఓసీ నాయకులను ఇన్‌చార్జీలుగా నియమించారు. విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తమ పార్టీ ఉద్యమిస్తోందని కవిత పేర్కొన్నారు. అదే ఆలోచనతో పార్టీ సంస్థాగత నియామకాల్లో కూడా సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. పార్టీ నిర్మాణంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యమని వెల్లడించారు.తనకు ఇష్టమైన ఐదు అంకె వచ్చేలా 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆషాఢ మాసంలో శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని ఈ నియామకాలను ప్రకటించినట్లు పేర్కొన్నారు. మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా త్వరలోనే ఇన్‌చార్జీలను నియమిస్తామని వెల్లడించారు. కొత్తగా నియమితులైన ఇన్‌చార్జీలు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో నిరంతరం ఉండాలని కవిత సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లే బాధ్యత ఇన్‌చార్జీలపై ఉంటుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటుతూ సంస్థాగత విస్తరణకు కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఇన్‌చార్జీల నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, సంస్థాగత కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని పార్టీ నాయకత్వం అభిప్రాయపడింది.

# కార్మిక సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

- బ్రిక్స్ వేదికపై మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రసంగం
- నైపుణ్యాభివృద్ధి, సంక్షేమంపై రాష్ట్ర ప్రత్యేకత



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** కార్మిక సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధిని సమన్వయం చేస్తూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు-భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం-2026 సదస్సులో "బ్రిక్స్ దేశాల్లో ఉత్తమ త్రైపాక్షిక విధానాలు" అంశంపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికులే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొంటూ వారి గౌరవం, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పని వాతావరణం, సామాజిక భద్రత కల్పించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రభుత్వం, యాజమాన్యాలు, కార్మిక సంఘాల మధ్య సమన్వయంతో అమలు చేస్తున్న త్రైపాక్షిక విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తెలిపారు. పరిశ్రమలు, యాజమాన్యాలు, కార్మిక సంఘాలతో ప్రభుత్వం నిరంతరం చర్చలు జరుపుతూ పారిశ్రామిక వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తోందన్నారు. దీనివల్ల పారిశ్రామిక శాంతి నెలకొనడంతో పాటు ఉత్పాదకత పెరిగి పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని చెప్పారు.కృత్రిమ మేధ, స్వయంచాలక సాంకేతికత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాల పాత్ర మరింత కీలకమైందని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉత్పాదకత పెంపు, సాంకేతిక మార్పులకు అనుగుణంగా కార్మికులను తీర్చిదిద్దడంలో కూడా కార్మిక సంఘాలు భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా, ఆర్థిక సహాయం, విద్యా ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు అసంఘటిత రంగ కార్మికుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డిజిటల్ వేదికల ద్వారా పనిచేసే కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన తొలి రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని గుర్తుచేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా 120 అధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. కృత్రిమ మేధ, ఆధునిక తయారీ, హరిత సాంకేతికత, ఆరోగ్య సేవలు తదితర రంగాల్లో ప్రపంచ స్థాయి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల సాధనకు ఈ కేంద్రాలు కీలకంగా మారనున్నాయని చెప్పారు. అలాగే తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ద్వారా ఇప్పటికే 16 దేశాల్లో సుమారు 14 వేల మంది యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు వివరించారు. బ్రిక్స్ దేశాల మధ్య నైపుణ్యాల పరస్పర గుర్తింపు, పారదర్శక నియామక విధానాలు, సామాజిక భద్రత, వలస కార్మికుల సమస్యల పరిష్కారంలో పరస్పర సహకారం పెరగాలని మంత్రి ప్రతిపాదించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు, విదేశీ ఉద్యోగాల్లో ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో పాల్గొన్న అంతర్జాతీయ ప్రతినిధులు తెలంగాణ కార్మిక సంక్షేమ విధానాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విదేశీ ఉపాధి కల్పన, త్రైపాక్షిక పారిశ్రామిక సంబంధాల విధానాన్ని ప్రశంసించారు.

# మైనారిటీ విద్యార్థినులకు కెరీర్ దిశానిర్దేశం

- ఐదు రోజుల శిక్షణ శిబిరం విజయవంతం
- రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు సన్నాహాలు



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** మైనారిటీ విద్యార్థినుల్లో ఉన్నత విద్య, ఉపాధి, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల కెరీర్ రెడీనెస్ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఆలోచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాలుగు జూనియర్ కళాశాలలకు చెందిన 120 మంది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో ఉన్నత విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై విద్యార్థినులకు కార్యాచరణ ఆధారిత శిక్షణ అందించారు. సంభాషణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే విధానం, ఆర్థిక అవగాహన, కెరీర్ ప్రణాళిక, సమస్యల పరిష్కార సామర్థ్యం, వినూత్న ఆలోచన, వృత్తిపరమైన ప్రదర్శన నైపుణ్యాలపై ప్రాయోగిక శిక్షణ నిర్వహించారు.

రాష్ట్రంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 98 బాలికల జూనియర్ కళాశాలలు నిర్వహణలో ఉండగా, 15,520 మందికి పైగా విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ శిక్షణ విజయవంతం కావడంతో భవిష్యత్తులో అన్ని కళాశాలలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. శిక్షణ నిర్వహణలో భాగస్వామ్యమైన సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఉన్నత విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాన్ని పెంచిందని తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలు ఈ శిబిరం ద్వారా అందాయని పేర్కొన్నారు.శిబిరానికి ఆతిథ్యం ఇచ్చిన కళాశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని విద్యార్థినుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే అనుభవంగా అభివర్ణించింది. శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు తమలో సంభాషణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆర్థిక అవగాహన, కెరీర్ ప్రణాళికపై విశ్వాసం మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు. మైనారిటీ యువతకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ నాయకత్వంలో మైనారిటీ విద్యార్థినులను ఆత్మవిశ్వాసంతో, నైపుణ్యాలతో, స్వావలంబనతో ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

# పాలమూరుకు కొత్త దశ

- పాలమూరు అభివృద్ధికి సీఎం భరోసా
- 90 టీఎంసీల నీటి అనుమతులపై ఆశాభావం
- అమర రాజా యూనిట్ ప్రారంభించిన సీఎం



**మహబూబ్‌నగర్, జూలై 15(మన విశ్వం ):** పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే శుభవార్త వినబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన అనుమతులు సాధించే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న దిండి, పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం పొరుగు రాష్ట్రంతో చర్చలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపుల అంశంపైనా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు విద్య, నీటిపారుదల, పారిశ్రామిక రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలు, ప్రతి నియోజకవర్గానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలతో పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేలా పర్యాటకం, ఇంధనం, వైద్యం, క్రీడలకు ప్రత్యేక విధానాలు రూపొందించామని వెల్లడించారు. అమర రాజా సంస్థ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడం అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, పరిశ్రమల్లో స్థానిక యువతకే అధిక ప్రాధాన్యంతో ఉద్యోగాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. స్థానిక ప్రజల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీకి విశేష ప్రాధాన్యం ఏర్పడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 32 గిగావాట్ గంటల సామర్థ్యం గల యూనిట్‌ను అమర రాజా ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. సంస్థలో 700 మంది ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని కొనియాడారు. చిత్తూరులో ప్రారంభమైన అమర రాజా సంస్థ నాలుగు దశాబ్దాల తర్వాత తెలంగాణలో భారీ పెట్టుబడులతో పరిశ్రమను ఏర్పాటు చేయడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచస్థాయి సంస్థలతో పోటీ పడుతున్న అమర రాజా చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాల కంపెనీలతో సమానంగా ఎదుగుతోందని ప్రశంసించారు. పరిశుభ్రమైన ఇంధనం, విద్యుత్ వాహనాల తయారీ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు.

# జనసేనలో కాంగ్రెస్ నేతల చేరిక



- తెలంగాణ కార్యాలయంలో కండువా కప్పిన తాళ్లూరి రామ్
- పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని పిలుపు

**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు జనసేన పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ వారికి పార్టీ కండువా కప్పి అధికారికంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొత్తగా చేరిన నేతలకు సూచించారు. జనసేనలో చేరిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బి. సునీల్ కుమార్, బి. రజినీకాంత్, హరీష్ బ్రహ్మసాని, నాగు కేతునాని, శ్రీకాంత్ పొద్దూరి, జూబ్లీహిల్స్‌కు చెందిన కృష్ణవేణి ఉన్నారు. వీరంతా తమ రాజకీయ ప్రయాణాన్ని జనసేనతో కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా తాళ్లూరి రామ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు సమష్టిగా పనిచేయాలని కోరారు. ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ తెలంగాణలో జనసేనను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు డాక్టర్ గడల శ్రీనివాస్ రావుతో సమన్వయంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తరించాలని తాళ్లూరి రామ్ సూచించారు. ప్రజా సమస్యలపై చురుకుగా స్పందిస్తూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు జనసేన సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలకు ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణలో జనసేన విస్తరణకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వివిధ జిల్లాల్లో ఇలాంటి చేరికలు కొనసాగనున్నాయని పార్టీ నాయకులు తెలిపారు.

# మ్యాట్రిమోనియల్ మోసాలపై హెచ్చరిక

- ప్రొఫైల్‌లను నమ్మొద్దని సూచన
- తనిఖీ.. తర్వాతే నిర్ణయం తీసుకోవాలి
- తెలంగాణ పోలీసుల అప్రమత్తత పిలుపు




**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** వివాహ పరిచయ వేదికలను ఉపయోగిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లలో నకిలీ వివరాలతో ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఆర్థిక సమాచారం పంచుకునే ముందు పూర్తి స్థాయిలో ధ్రువీకరించుకోవాలని స్పష్టం చేశారు. వివాహ పరిచయ వెబ్‌సైట్లలో ఆకర్షణీయమైన వివరాలు, నకిలీ ఫొటోలు, తప్పుడు ఉద్యోగ సమాచారం, విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పి కొందరు మోసగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. పరిచయం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే డబ్బు అవసరమని, అత్యవసర పరిస్థితి ఉందని చెప్పి ఆర్థిక సహాయం కోరే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని హెచ్చరించారు. వివాహం పేరుతో మోసాలకు పాల్పడేవారు తమ అసలు వివరాలను దాచిపెట్టి నకిలీ గుర్తింపులతో వ్యవహరిస్తారని పోలీసులు పేర్కొన్నారు. అందువల్ల ఎదురుగా ఉన్న వ్యక్తి ఉద్యోగం, కుటుంబ నేపథ్యం, చిరునామా, ఇతర వివరాలను స్వతంత్రంగా ధ్రువీకరించుకున్న తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అవసరమైతే కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పరిచయం ప్రారంభమైన వెంటనే వ్యక్తిగత ఫొటోలు, గుర్తింపు పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, గోప్యమైన సమాచారాన్ని పంచుకోవద్దని పోలీసులు సూచించారు. ఎలాంటి అనుమానాస్పద ప్రవర్తన కనిపించినా వెంటనే సంబంధిత వెబ్‌సైట్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

సామాజిక మాధ్యమాలు, మ్యాట్రిమోనియల్ వేదికల ద్వారా జరిగే మోసాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన అత్యంత అవసరమని పోలీసులు తెలిపారు. వివాహ సంబంధాల విషయంలో భావోద్వేగాలకు లోనుకాకుండా ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. మ్యాట్రిమోనియల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉంటేనే ఆర్థిక, వ్యక్తిగత నష్టాలను నివారించవచ్చని తెలంగాణ పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించి, సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆధునిక సాగుతో అధిక దిగుబడులు



- ప్రాజెక్ట్ కే-100కు శ్రీకారం
- రైతులకు విత్తనాల పంపిణీ

**నారాయణపేట, జూలై 15 (మన విశ్వం ):** రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ పంటల వైవిధ్యీకరణ చేపట్టి అధిక దిగుబడులు, అధిక ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. బుధవారం కోస్గి మండలం మల్లారెడ్డిపల్లి రైతు వేదికలో నిర్వహించిన క్షేత్ర పర్యటనలో ఆమె పాల్గొని ఆధునిక సాగు విధానాలను పరిశీలించారు. మల్చింగ్ పద్ధతిలో వంకాయ, పచ్చిమిర్చి సాగు, స్టేకింగ్ విధానంలో టమాట సాగు, పూల సాగును పరిశీలించిన కలెక్టర్, రైతులు అవలంబిస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలను అభినందించారు. ఇతర రైతులు కూడా నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలు, కరువును తట్టుకునే స్వల్పకాలిక రకాల సాగు చేపట్టాలని, వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫారం పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్‌తో కలిసి "ప్రాజెక్ట్ కే-100"ను ప్రారంభించారు. సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పేర్కొంటూ జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయలు, పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి, ఏడీఏ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ఉద్యాన శాఖ అధికారి హర్షవర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, రైతులు పాల్గొన్నారు. కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమల్ మండలాలకు చెందిన సుమారు 120 మంది రైతులు పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, ప్రాజెక్ట్ కే-100 ప్రయోజనాలపై అవగాహన పొందినట్లు అధికారులు తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే వ్యవసాయంలో అధిక లాభాలు సాధించడంతో పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

# భవితకు 'ఫ్యూచర్' బాట!

- భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని అమెజాన్‌కు పిలుపు
- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం




**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** తెలంగాణను 2034 నాటికి అగ్రగామిగా నిలిపి, వన్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ముందడుగు వేసింది. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌కు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విశ్వనగరంగా రూపుదిద్దుకోబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రస్థానంలో ఈ డేటా సెంటర్ తొలి, అత్యంత కీలకమైన అడుగు అని అభివర్ణించారు.?రాబోయే 14 ఏళ్లలో అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 58 వేల కోట్లు) పెట్టుబడులు పెట్టనుందని సీఎం తెలిపారు. ఇదే జోరుతో తెలంగాణపై నమ్మకంతో 2034 నాటికి తమ పెట్టుబడులను రూ. లక్ష కోట్లకు పెంచాలని ఆయన అమెజాన్ ప్రతినిధులను కోరారు. ఇందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని, పెట్టుబడుల పురోగతిని ప్రతి నెలా తానే స్వయంగా పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు.

**- మూడు మండలాలుగా విభజన.. ఇదీ ప్రణాళిక!**

రాష్ట్ర సమగ్ర వికాసం కోసం పారిశ్రామిక రంగాన్ని మూడు మండలాలుగా (త్రీ జోన్స్) వర్గీకరించి సరికొత్త కార్యాచరణను రూపొందించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

తెలంగాణ అభివృద్ధి 'త్రిశూలం'

1. ఓ ఆర్ ఆర్ లోపలి ప్రాంతం- సేవా రంగం
2. ఓ ఆర్ ఆర్ - ట్రిపుల్ ఆర్ మధ్య ప్రాంతం- తయారీ రంగం
3. ట్రిపుల్ ఆర్ అవతలి ప్రాంతం- వ్యవసాయ ఆధారితం

**- లక్ష్యం.. దేశ జీడీపీలో పది శాతం!**

"దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5 శాతమే. కానీ దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)కి మనం అందిస్తున్న వాటా ఐదు శాతం. దీనిని 2047 నాటికి పది శాతానికి పెంచడమే మా సంకల్పం" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అప్పటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చుతామన్నారు. ఇందుకోసం సింగిల్ విండో విధానంలో వేగంగా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్' గ్లోబల్ సదస్సుకు 108 దేశాల ప్రతినిధులను, 3 వేలకు పైగా కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించడం కూడా ఫార్చ్యూన్-500 సంస్థలను ఆకర్షించే వ్యూహంలో భాగమేనని వివరించారు.

**- కాలుష్య రహిత 'మూసీ'.. గ్రీన్ హైదరాబాద్**

హైదరాబాద్‌ను పర్యావరణహిత మహానగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలిస్తున్నామని, మూసీ నది ప్రక్షాళనను వేగవంతం చేశామని చెప్పారు. నగర ంలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నామని, విద్యుత్ వాహనాలకు పన్ను మినహాయింపులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

**- రైతుల త్యాగం అమూల్యం!**

"పరిశ్రమలు, నగరాభివృద్ధి కోసం భూములు ఇస్తున్న రైతుల త్యాగాన్ని ఈ ప్రభుత్వం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. వారికి మరింత మెరుగైన నష్టపరిహారం అందించి, అండగా ఉంటాం. నీరు, నిధులు, నిరంతర విద్యుత్, నైపుణ్యం కలిగిన యువతే పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా మార్చబోతున్నాయి."

**- ఎ. రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి**

# అన్నం లేదా రోటీలు.. రెండింటిలో ఏది ఉత్తమ ఆహారం..

అన్నం మంచిదా? రోటీ మంచిదా? అనే చర్చ ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటుంది. కొందరు బరువు తగ్గాలంటే అన్నం పూర్తిగా మానేయాలని భావిస్తే, మరికొందరు రోటీనే ఆరోగ్యకరమైన ఎంపిక అంటుంటారు. అయితే జీర్ణక్రియ, శరీర అవసరాలు, తీసుకునే పరిమాణం, భోజనంలో ఉండే ఇతర పదార్థాలపై ఆధారపడి రెండింటికీ ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియ పరంగా చూస్తే తెల్ల బియ్యంలో ఉండే పైపొర తొలగిపోవడం వల్ల ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది త్వరగా జీర్ణమై పొట్టపై తక్కువ ఒత్తిడి కలిగిస్తుంది. అసిడిటీ, కడుపు ఉబ్బరం లేదా బలహీనమైన జీర్ణక్రియ ఉన్నవారికి అన్నం తేలికగా జీర్ణమయ్యే ఆహారంగా ఉపయోగపడుతుంది. మరోవైపు రోటీ సంపూర్ణ గోధుమ పిండితో తయారవుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది. ఇది పేగుల ఆరోగ్యానికి, మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించినప్పటికీ, కొంతమందికి ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి రోటీ కొంత భారంగా అనిపిస్తుంది.

షుగర్ లెవల్స్ పెరుగుతాయా..అన్నం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయని చాలామంది భావిస్తుంటారు. అయితే



పరిశోధనల ప్రకారం, పరిమిత మోతాదులో తీసుకుంటే తెల్ల బియ్యం, గోధుమ రోటీల గ్లైసెమిక్ ఇండెక్స్‌లో పెద్దగా తేడా ఉండదు. రక్తంలో చక్కెరపై ప్రభావం చూపేది కేవలం అన్నం లేదా రోటీ మాత్రమే కాదు. ఎంత పరిమాణంలో తింటున్నాం, వాటితోపాటు కూరగాయలు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు తీసుకుంటున్నామా లేదా, వంట విధానం ఎలా ఉందనే అంశాలు కూడా కీలకంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారు అన్నాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. బరువు పెరగడానికి లేదా తగ్గడానికి ప్రధాన కారణం మొత్తం కేలరీల వినియోగం,అలవాటు తగ్గుతుంది.

# గిడ్డంగుల సామర్థ్యం భారీగా పెంపు

- మరో 5 లక్షల టన్నుల నిల్వ లక్ష్యం
- శాస్త్రీయ గోదాముల నిర్మాణానికి ప్రాధాన్యం
- రైతులకు మెరుగైన నిల్వ సౌకర్యాలే లక్ష్యం



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** రాష్ట్రంలో రైతులకు మరింత మెరుగైన నిల్వ సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా వచ్చే రెండేళ్లలో మరో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్‌ల మేనేజింగ్ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్ల డించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల వారీగా వచ్చే 20 ఏళ్ల గిడ్డంగుల అవసరాలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 సొంత గిడ్డంగులు ఉండగా, వాటి మొత్తం నిల్వ సామర్థ్యం సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. ప్రస్తుతం 104 శాతానికి పైగా వినియోగంతో 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఈజీ, పెట్టుబడిదారుల గిడ్డంగులు, అద్దె గిడ్డంగులతో కలిపి మొత్తం 524 గిడ్డంగులను వినియోగిస్తున్నట్లు వివరించారు.రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా గిడ్డంగుల విస్తరణ చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 48 కొత్త గిడ్డంగుల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని, తొలి దశలో 17 గిడ్డంగులను 2027 జనవరి నాటికి పూర్తి చేసి 2.12 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం కల్పిస్తామని చెప్పారు. రెండో దశలో 31 గిడ్డంగులను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మరో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అదనంగా మరో 32 గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వీటితో మొత్తం రాష్ట్ర నిల్వ సామర్థ్యం సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందని పేర్కొన్నారు.కొత్తగా నిర్మించే ప్రతి గిడ్డంగిపై తప్పనిసరిగా సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. గిడ్డంగుల అవసరాలకు కావాల్సిన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి అదనపు ఆదాయం సమకూర్చుకునేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, హాకా, వేర్‌హౌసింగ్ సంస్థల ఆధీనంలోని గిడ్డంగులను ఒకే సమన్వయ వ్యవస్థ కింద నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని, దీంతో నిర్వహణ వ్యయాలు తగ్గడంతో పాటు ప్రభుత్వ వనరుల వినియోగం మరింత సమర్థవంతంగా మారుతుందని చెప్పారు.

ప్రభుత్వ కార్పొరేషన్లు ఆర్థికంగా బలోపేతం కావాలంటే వడ్డీ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు అవసరం లేని ప్రైవేటు గిడ్డంగుల అద్దెలను తగ్గించాలని మంత్రి సూచించారు. ముందుగా ప్రభుత్వ సంస్థల ఆధీనంలో ఖాళీగా ఉన్న గిడ్డంగులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అన్ని కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కేంద్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌తో సమన్వయం పెంచి రాష్ట్రానికి లభించాల్సిన నిధులు, ఇతర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు. కొత్త గిడ్డంగుల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక ఇంజనీరింగ్ అధికారులను నియమించి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఆధునిక గిడ్డంగుల నమూనాలను అధ్యయనం చేసి, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎక్కువకాలం మన్నికగా ఉండే నమూనాలతో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఆధునిక నిల్వ సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వ కార్పొరేషన్లను ఆర్థికంగా బలోపేతం చేయడం, సాంకేతికతను వినియోగించి ఆదాయ వనరులను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

# డంప్‌యార్డుపై పోరాటం ఉధృతం

- ఈటలను కలిసిన అఖిలపక్ష నేతలు
- బాధితులకు అండగా ఉంటానన్న ఎంపీ
- పార్లమెంట్‌లో సమస్య ప్రస్తావన హామీ



**శామీర్‌పేట్, జూలై 15 (మన విశ్వం ):** జవహర్‌నగర్ డంప్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ అఖిలపక్ష నాయకులు, సంయుక్త చర్యా సమితి ప్రతినిధులు, స్థానిక ప్రజలు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శామీర్‌పేట్‌లోని ఆయన శిబిర కార్యాలయంలో కలిశారు. డంప్‌యార్డుకు వ్యతిరేకంగా రెండు దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమానికి రాజకీయాలకు అతీతంగా నాయకత్వం వహించాలని కోరారు. ఇరవై ఏళ్లుగా చెత్త కుప్పలు, కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్నామని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల డంప్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల సందర్భంగా ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో ఈటల రాజేందర్ స్వయంగా వచ్చి మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. తమ కష్టకాలంలో అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డంప్‌యార్డును తరలిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని నాయకులు ఆరోపించారు. జవహర్‌నగర్ ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యత ఇప్పుడు ఎంపీ ఈటలపై ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వారి వినతిపై స్పందించిన ఈటల రాజేందర్ జవహర్‌నగర్ డంప్‌యార్డు బాధితుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఒక్కటై పోరాడటం అభినందనీయమని పేర్కొన్నారు. డంప్‌యార్డు పరిసరాల్లో నివసిస్తున్న వారు ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందినవారేనని, వారి ఆరోగ్యంతో ప్రభుత్వం ఆటలాడకూడదని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల వెంటే నిలిచి ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని భరోసా ఇచ్చారు. డంప్‌యార్డు సమస్యపై గతంలో ముఖ్యమంత్రితో పాటు మున్సిపల్ అధికారులతో పలుమార్లు మాట్లాడినట్లు ఈటల తెలిపారు. గతంలో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలని కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. ఫలితంగా జవహర్‌నగర్ పరిసర ప్రాంతాలు తీవ్ర కాలుష్యానికి గురై విషవలయంగా మారాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరసనలు తెలిపిన వారిపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం సరైన విధానం కాదని అన్నారు.

ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న తనపై గతంలో వందలాది కేసులు నమోదు చేశారని, అలాంటి బెదిరింపులకు తాను భయపడబోనని ఈటల స్పష్టం చేశారు. అయితే ఉద్యమం శాంతియుతంగా కొనసాగాలని, ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ప్రజాశక్తి ముందు ఎవరైనా తలవంచాల్సిందేనని, భయపడాల్సిన అవసరం లేదని ఉద్యమకారులకు ధైర్యం చెప్పారు. జవహర్‌నగర్ ప్రజల సమస్యను దేశ రాజధానిలో వినిపిస్తానని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో డంప్‌యార్డు అంశాన్ని ప్రస్తావిస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. డంప్‌యార్డును పూర్తిగా తరలించి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం ఆపబోనని, ప్రజల్లో ఒకడిగా ఉంటూ వారికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

# ఓటర్లకు కమిషనర్ కీలక విజ్ఞప్తి

- ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించండి
- సర్ ప్రక్రియపై అధికారుల సమీక్ష



**హైదరాబాద్, జూలై 15 (మన విశ్వం ):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే సమర్పించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి. సంతోష్‌తో కలిసి సర్ కార్యక్రమం పురోగతిని బుధవారం సమీక్షించారు. ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చివరి దశకు చేరుకుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే పంపిణీ చేసిన ఫారాలను బూత్ స్థాయి అధికారులు సేకరిస్తుండగా, అందిన ఫారాల డిజిటలీకరణ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఓటరు తన వివరాలను సరిచూసుకుని పూర్తి చేసిన ఫారాన్ని నిర్ణీత గడువులోగా సమర్పించాలని కమిషనర్ సూచించారు.

ఇంకా ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారి లేదా బీఎల్ఓ సూపర్వైజర్‌ను వెంటనే సంప్రదించాలని అధికారులు సూచించారు. అవసరమైతే ఓటర్ల హెల్ప్‌లైన్ 1950కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని తెలిపారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఫారాలను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జీహెచ్‌ఎంసీ విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇంటింటి ప్రచారం, బహిరంగ ప్రకటనలు, మాధ్యమాల ద్వారా ప్రచారం, వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లలో చైతన్యం కల్పిస్తోంది. ప్రతి అర్హ ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకత ఎన్నికల వ్యవస్థకు అత్యంత కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. అందుకే ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలీకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఎన్నికల సిబ్బందిని సంప్రదించి వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడమే లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి అర్హ ఓటరు సమయానికి ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి తన ఓటు హక్కును కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వామి కావాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయులకు కతిమ మేధ శిక్షణ

- బోధనా నైపుణాల పెపుపై దషి
- శిక్షణ కారకమాని పరిశీలిచిన కలెకర్



**జగితాల, జూలై 15 (మన విశ):** జిలాలోని ఉనత పాఠశాల ఉపాధాయుల బోధనా నైపుణాలను మెరుగుపరిచేదుకు నిరహిసున సబెకు వారీ వతి పరమైన శిక్షణ కారకమాని జిలా కలెకర్ బి. సతపసాద్ పరిశీలిచారు. జిలా కేదలోని జాన ఉనత పాఠశాలలో ఆగ భాష ఉపాధాయులకు నిరహిసున మూడు రోజుల శిక్షణను ఆయన తనిఖీ చేసి శిక్షణ తీరును సమీక్షిచారు. శిక్షణలో భాగగా రిసోర్ పరన్ బోధనను కలెకర్ పతక్షగా వీక్షిచారు. కతిమ మేధ సాకేతికతను విదారుల అభాసలో ఎలా వినియోగిచాలనే అశపై జరుగుతున శిక్షణను ఆసకిగా పరిశీలిచారు. మారుతున విదా విధానాలకు అనుగుణగా ఉపాధాయులు ఆధునిక సాకేతిక పరిజానాని అదిపుచుకోవాలని సూచిచారు. శిక్షణలో నేరుకున అశాలను తరగతి గదిలో సమరవతగా అమలు చేయాలని కలెకర్ ఉపాధాయులకు సూచిచారు. విదారి కేదిత బోధనా విధానాలను అనుసరిచడ దారా భాషా నైపుణాలు, సజనాతకత, ఆలోచనా సామరాని పెపొదిచవచని తెలిపారు. విదారులో నేరుకునే ఆసకిని పెచేలా వినూత పదతులను అవలబిచాలని అనారు. విదా పమాణాల మెరుగుదలకు ఉపాధాయుల శిక్షణ కీలకమని కలెకర్ పేరొనారు. నాణమైన బోధన దారా పభుత పాఠశాలలో చదువుతున విదారులకు మెరుగైన ఫలితాలు సాధిచే అవకాశ ఉటుదని చెపారు. పతి ఉపాధాయుడు నిరతర కొత పదతులను నేరుకుటూ బోధనలో వినియోగిచాలని సూచిచారు.

శిక్షణ కారకమాల దారా ఉపాధాయుల వతి నైపుణాలు మరిత మెరుగుపడతాయని, విదారులకు నాణమైన విద అదిచడలో ఇవి కీలక పాత పోషిసాయని కలెకర్ తెలిపారు. సాకేతిక పరిజానాని సమరగా వినియోగిచడ దారా విదను మరిత పభావవతగా మారవచని పేరొనారు. ఈ కారకమలో జిలా విదాశాఖ అధికారి కె. రాము, సమగ శిక్ష సమనయకరలు, రిసోర్ పరను, ఉపాధాయులు పాలొనారు. జిలాలోని పభుత పాఠశాలలో విదా పమాణాల పెపునకు ఇటువటి శిక్షణ కారకమాలను నిరతర నిరహిచాలని కలెకర్ అధికారులకు సూచిచారు.

# ఆరోగ్య పాఠశాలపై కలెక్టర్ సమీక్ష



- గ్రంథాలయం, పోషక తోట ప్రారంభం
- ఫిర్యాదులపై వెంటనే చర్యల ఆదేశం
- విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

**ఆదిలాబాద్, జూలై 15 (మన విశ్వం):** సోనాల మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం, పోషక తోటను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మొక్క నాటి నీరు పోశారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు పోషకాహారం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అందులో వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా నిర్భయంగా తమ అభిప్రాయాలను తెలియజేసే వాతావరణం ఉండాలని సూచించారు.

విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపై కూడా విద్యార్థుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థాయి కమిటీల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్య కరమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, మండల తహసీల్దార్ మల్లేష్, మండల అభివృద్ధి అధికారి రత్నాకర్ రావు, మండల విద్యాశాఖ అధికారి ఉస్సేన్, సర్పంచ్ బిందుజ, ప్రధానోపాధ్యాయుడు సచిన్, విద్యాశాఖ సిబ్బంది, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కఠిన చర్యలు



- పెండింగ్ కేసులపై వేగవంతమైన దర్యాప్తు
- సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి
- ప్రజలకు మెరుగైన పోలీసు సేవలే లక్ష్యం

యాదాద్రి భువనగిరి జిల్లా నేరాల సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ నిర్వహించారు. జిల్లాలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల పురోగతి, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు కనిపించేలా పోలీసు విధులు నిర్వహించే విధానాన్ని మరింత బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసి నేరాలను ముందుగానే గుర్తించి అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ సూచించారు. సంబంధిత సాంకేతిక వేదికల వినియోగాన్ని పెంచి, నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతలు, నేరాల దర్యాప్తు, సైబర్ విభాగం, సమాచార సాంకేతిక విభాగాల మధ్య సమన్వయం పెంచి కేసులను త్వరగా ఛేదించాలని పేర్కొన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాల వారీగా నిఘా కెమెరాల వ్యవస్థను విస్తరించి నేరాల నియంత్రణకు ఉపయోగించుకోవాలని సూచించారు. రహదారులపై పెట్రోలింగ్, నాకాబందీ, వాహనాల తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులకు సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని కూడా ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే ప్రధాన లక్ష్య మని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో రాజీ పడకుండా పనిచేయాలని, ప్రతి ఫిర్యాదుపై సకాలంలో స్పందించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని జిల్లా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మటన్ అంటే గొర్రె మాంసమా.. మరి మేక మాంసాన్ని ఏమని పిలుస్తారు..?



మన దేశంలో మటన్ అంటే మేక మాంసమే అని చాలామంది భావిస్తారు. హోటల్‌లో మటన్ బిర్యానీ, మటన్ కర్రీ లేదా మటన్ కబాబ్ ఆర్డర్ చేస్తే సాధారణంగా మేక మాంసంతో చేసిన వంటకాలే వడ్డిస్తారు. అయితే ప్రపంచంలోని అనేక దేశాల్లో మటన్ అనే పదానికి పూర్తిగా భిన్నమైన అర్థం ఉంది. ఈ తేడా భాష, చరిత్ర, వలస పాలన, స్థానిక ఆహార సంస్కృతి ప్రభావంతో ఏర్పడిందని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో మటన్ అనే పదాన్ని ఎక్కువగా మేక మాంసానికి ఉపయోగిస్తారు. కానీ యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో మటన్ అంటే వయసు వచ్చిన గొర్రె మాంసం. ఒక సంవత్సరం లోపు వయసున్న గొర్రె మాంసాన్ని ల్యాంబ్ అని, మేక మాంసాన్ని గోట్ మీట్ అని ప్రత్యేకంగా పిలుస్తారు. అందుకే విదేశాలకు వెళ్లిన భారతీయులు మటన్ ఆర్డర్ చేసినప్పుడు గొర్రె మాంసం రావడం చూసి ఆశ్చర్యపోతుంటారు. దక్షిణాసియాలో కూడా కొన్ని ప్రాంతాల్లో స్థానిక ఆహారపు అలవాట్లను బట్టి మటన్ ఉన్నాయి.



## సీనియర్ల రాకతో బలంగా టీమిండియా జట్టు

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో చిత్తు చిత్తుగా ఓడిన భారత జట్టు.. తొలి వన్డేలో మాత్రం ఘనవిజయాన్ని అందుకుంది. సీనియర్లు రావడంతో జట్టు బలంగా తయారైంది. మొదట బౌలర్లు ప్రతాపం చూపిస్తే.. ఆ తర్వాత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఫలితంగా భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు విఫలం అయ్యారు. కోహ్లీ కేవలం 5 పరుగులు చేసి అవుటైతే.. రోహిత్ శర్మ 11 పరుగులు మాత్రమే చేశాడు. అయితే గిల్ (80 రిటైర్డ్ హర్ట్) జట్టుకు విజయాన్ని ఖాయం చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవడానికి ముఖ్య కారణం బౌలర్లు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో మంచి ప్రదర్శన చేసింది. ముఖ్యంగా బెన్ డకెట్ (43) అద్భుతంగా ఆడాడు. తొలి వికెట్‌కు బెతెల్ (14)తో కలిసి 61 పరుగులు జోడించారు. ఈ దశలో ఇంగ్లండ్ 300కు పైగా పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బౌలర్ గుర్నార్ బ్రార్ టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. బంతిని అందుకున్న అతడు 3 బంతుల వ్యవధిలో 2 వికెట్లు తీశాడు. 13వ ఓవర్ వేసిన బ్రార్.. మొదట జాకబ్ బెతెల్‌ను అవుట్ చేశాడు. అనంతరం డేంజరస్ ప్లేయర్ బెన్ డకెట్‌ను అవుట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 2 పరుగుల తేడాతో రెండు వికెట్లను కోల్పోయింది. ఇక ఇక్కడి నుంచి భారత జట్టు పుంజుకుంది. ఆ వెంటనే మరో డేంజరస్ ప్లేయర్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా అవుట్ చేశాడు. అంతే ఇంగ్లండ్ వెంటవెంటనే 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికట్లను కోల్పోయింది. ఒక దశలో 61 పరుగులకు వికెట్ లేకుండా ఉన్న ఇంగ్లండ్.. 46 పరుగుల తేడాతో 6 వికెట్లను కోల్పోయింది. గుర్నూర్ బ్రార్ 9 ఓవర్లలో 2 వికెట్లు తీశాడు. అయితే మ్యాచ్ మధ్యలో కాస్త అతి కూడా చేశాడు. బెన్ డకెట్ నేరుగా కొట్టిన షాట్‌ను అడ్డుకున్న బ్రార్.. బంతిని డకెట్ వైపు విసిరాడు. ఆ తర్వాత బంతిని డకెట్ సిక్సర్ బాదాడు. సోషల్ మీడియాలో.. ఇలాంటి అతి పనులు చేయకు బ్రార్.. నీలో గొప్ప ట్యాలెంట్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# కోహ్లీతో కలిసి వరల్డ్‌కప్ 2027 ప్లాన్..

### కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు



భారత వన్డే జట్టు భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలతో తెరదించారు. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళికలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అందులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కోహ్లీ భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలకు కొత్త కోణం లభించింది. ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో గిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ 2027లో జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగుతారా లేదా అన్న ప్రశ్నలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గిల్ స్పందిస్తూ, తాను రెండు రోజుల క్రితమే విరాట్ కోహ్లీతో కలిసి 2027 ప్రపంచకప్‌కు సంబంధించిన ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. “మేము జట్టు కాంబినేషన్ గురించి మాట్లాడుకున్నాం. ప్రపంచకప్ జట్టులో ఎవరెవరు ఉండొచ్చు, ప్రస్తుతం జట్టులో లేకపోయినా భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే ఆటగాళ్లు ఎవరు, ఏ ఆటగాడిని ఏ స్థానంలో ఆడించడం జట్టుకు ఉపయోగపడుతుంది వంటి అనేక అంశాలపై చర్చించాం” అని గిల్ తెలిపారు. ఈ వ్యాఖ్యలు చూస్తే కోహ్లీని కేవలం సీనియర్ ఆటగాడిగానే కాకుండా, జట్టు వ్యూహాల రూపకల్పనలో భాగస్వామిగా కూడా భారత జట్టు యాజమాన్యం పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొద్ది రోజుల క్రితం విరాట్ కోహ్లీ మాట్లాడుతూ, తాను తన స్థానాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉన్న జట్టులో కొనసాగాలని అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. అలాంటి సమయంలో గిల్ చేసిన తాజా వ్యాఖ్యలు కోహ్లీపై జట్టు యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని మరోసారి తెలియజేశాయి. తన నాయకత్వంలో కూడా కోహ్లీ కీలక పాత్ర పోషిస్తారని గిల్ స్పష్టం చేసినట్లుగా ఈ వ్యాఖ్యలను విశ్లేషకులు భావిస్తున్నారు. కెప్టెన్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత టెస్టులు, టీ20ల్లో కోహ్లీ ప్రత్యక్షంగా నాయకత్వ వ్యవహారాల్లో పెద్దగా పాల్గొనలేదు. అయితే ఇప్పుడు 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయనతో కలిసి వ్యూహాలపై చర్చించడం కొత్త పరిణామంగా భావిస్తున్నారు. ఇది జట్టు నిర్మాణంలో కోహ్లీ అనుభవానికి ఇప్పటికీ ఎంత ప్రాధాన్యం ఉందో తెలియజేస్తోందని క్రికెట్ నిపుణులు అంటున్నారు. వన్డే క్రికెట్‌లో కెప్టెన్‌గా కూడా కోహ్లీ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆయన భారత జట్టుకు మొత్తం 95 వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించి 65 విజయాలు అందించారు. 68.42 శాతం విజయశాతంతో ఒకటి కంటే ఎక్కువ వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారత కెప్టెన్లలో అత్యుత్తమ విజయశాతాన్ని నమోదు చేశారు. ఈ గణాంకాలు కూడా ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వయస్సు గురించి వస్తున్న ప్రశ్నలపైనా గిల్ స్పందించారు. గత పదేళ్లుగా భారత బ్యాటింగ్‌కు ఈ ఇద్దరూ వెన్నెముకగా నిలిచారని కొనియాడారు. వివిధ దేశాల్లో, భిన్నమైన పరిస్థితుల్లో ఎన్నో మ్యాచ్‌లు గెలిపించిన అనుభవం వారికి ఉందని చెప్పారు. వారి అనుభవం, నైపుణ్యం జట్టుకు ఇప్పటికీ ఎంతో విలువైనవని స్పష్టం చేశారు. భారత వన్డే జట్టు భవిష్యత్తు నిర్మాణంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పిస్తూనే, అనుభవజ్ఞులైన కోహ్లీ, రోహిత్‌ల మార్గదర్శకత్వాన్ని కూడా వినియోగించుకోవాలనే ఆలోచనలో జట్టు యాజమాన్యం ఉన్నట్లు గిల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా భారత జట్టు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుండగా, కోహ్లీ, రోహిత్ ఇద్దరూ ఆ ప్రణాళికల్లో కీలక భాగస్వాములుగానే కొనసాగుతున్నారని గిల్ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

# ఫైనల్‌కు దూసుకెళ్లిన స్పెయిన్



టెక్సాస్‌లోని అర్లింగ్టన్‌లో మంగళవారం జరిగిన ఈ కీలక పోరులో స్పెయిన్ తన వ్యూహాత్మక ఆటతీరుతో ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాళ్లను పూర్తిగా కట్టడి చేసింది. ఈ విజయంతో మూడోసారి ప్రపంచకప్ గెలవాలనే ఫ్రాన్స్ కలలను స్పెయిన్ చెదరగొట్టింది. ఈ టోర్నమెంట్‌లో వరుస విజయాలతో ఫ్రాన్స్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ, స్పెయిన్ ఆటగాళ్ల జోరు ముందు నిలవలేకపోయింది. మ్యాచ్ మొదటి సగభాగంలో ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే, స్పెయిన్ వింగర్ లామిన్ యమల్‌ను ఫౌల్ చేయడంతో రిఫరీ స్పెయిన్‌కు పెనాల్టీ ఇచ్చారు. దీనిని మైకెల్ ఓయర్జబల్ గోల్‌గా మలిచి స్పెయిన్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నమెంట్‌లో ఫ్రాన్స్ జట్టు ప్రత్యర్థికి ఆధిక్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. ఆ తర్వాత కొద్దిసేపటికే ఫ్రాన్స్ కీలక డిఫెండర్ విలియం సలిబా వెన్నునొప్పి కారణంగా మైదానాన్ని వీడడం ఆ జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ద్వితీయార్ధంలో ఫ్రాన్స్ కోచ్ డిడియర్ డెషాంప్స్ తమ అటాకింగ్‌ను బలోపేతం చేసేందుకు మార్పులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మ్యాచ్ 58వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పెడ్రో పోరో, డాని ఓల్మో అందించిన పాస్‌ను అద్భుతమైన గోల్‌గా మలిచి జట్టు ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. కిలియన్ ఎంబాపె, ఉస్మాన్ డెంబెలే వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఫ్రాన్స్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ టోర్నమెంట్‌లో స్పెయిన్ డిఫెన్స్ అత్యంత బలంగా ఉంది, వారు మొత్తం టోర్నీలో కేవలం ఒకే ఒక్క గోల్ సమర్పించుకున్నారు. ఇప్పుడు స్పెయిన్ జట్టు ఆదివారం జరగబోయే ఫైనల్‌లో ఇంగ్లాండ్ లేదా అర్జెంటీనాతో తలపడనుంది. మరోవైపు, గత రెండు ప్రపంచకప్‌లలో ఫైనల్‌కు చేరిన ఫ్రాన్స్ జట్టుకు ఈ ఓటమి పెద్ద షాక్ ఇచ్చింది. ఈ టోర్నమెంట్ తర్వాత ఫ్రాన్స్ కోచ్‌గా 14 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించి తప్పుకోనున్న డిడియర్ డెషాంప్స్‌కు నిరాశే మిగిలింది. ఓడిపోయిన ఫ్రాన్స్ జట్టు శనివారం జరిగే మూడో స్థానం కోసం ప్లే-ఆఫ్ మ్యాచ్ ఆడనుంది. ఈ విజయంపై స్పెయిన్ గోల్ స్కోరర్ పెడ్రో పోరో స్పందిస్తూ, ఇది ఒక “కల నిజమవ్వడం” లాంటిదని, జట్టు సమిష్టికృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశాడు.

# 2027 వన్డే ప్రపంచకప్‌లో సరికొత్త ఫార్మాట్

### • కీలక మార్పులు చేసిన ఐసీసీ



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టోర్నమెంట్ల విధానాలలో కీలక మార్పులు తీసుకొచ్చింది. టోర్నీల్లో పోటీ స్థాయిని పెంచడం, ప్రతి మ్యాచ్‌కు మరింత ప్రాధాన్యం కల్పించడం, అభిమానులకు మరింత ఆసక్తికర అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా కొత్త విధానాలను ప్రవేశపెట్టింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ సిఫార్సుల మేరకు ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ బోర్డు వార్షిక సమావేశాలలో ఈ నిర్ణయాలు తీసుకుంది. 2027 వన్డే ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు బరిలోకి దిగనున్నాయి. 2019, 2023 ప్రపంచకప్‌ల్లో 10 జట్లు మాత్రమే పాల్గొనగా, 2015 తర్వాత మళ్లీ 14 జట్లతో టోర్నీ నిర్వహించనున్నారు. అయితే నాకౌట్ రౌండ్లకు ముందు ఇది మూడు దశల్లో మ్యాచులు నిర్వహిస్తారు. ఈ ఫార్మాట్ ప్రకారం తొలుత అర్హత సాధించిన జట్లలో అత్యల్ప ర్యాంకింగ్ కలిగిన మూడు జట్లు (12, 13, 14వ స్థానాల్లో ఉన్నవి) మొదట ‘సూపర్ సిరీస్’ (రౌండ్-రాబిన్)లో పాల్గొంటాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన జట్టు తదుపరి దశలో మిగిలిన 11 జట్లతో కలుస్తుంది. అప్పటి నుంచి అసలైన టోర్నీ ప్రారంభం అవుతుంది. రెండో దశలో ఆరు జట్ల చొప్పున రెండు గ్రూపులు ఉంటాయి. ప్రతి గ్రూప్ రౌండ్-రాబిన్ పద్ధతిలో పోటీపడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 7 దశకు చేరుకుంటాయి. ఈ ఆరు జట్లు కాకుండా ఈ రెండు గ్రూప్‌లలో కలిపి అత్యుత్తమ ప్రదర్శన చేసిన మరో జట్టు కూడా సూపర్ 7కు చేరుతుంది. ‘సూపర్ 7’ దశలో ఏడు జట్ల మధ్య సింగిల్ రౌండ్-రాబిన్ పోటీ జరుగుతుంది. ‘సూపర్ 7’ దశలో మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఇందులో మొదటి స్థానంలో ఉన్న జట్టు నాలుగో స్థానంలో ఉన్న జట్టుతోనూ, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో స్థానంలో ఉన్న జట్టుతోనూ తలపడతాయి. విజేతలు ఫైనల్‌లో పోటీపడతారు. మరిన్ని జట్లకు అతిపెద్ద వేదికపై పోటీపడే అవకాశాలను కల్పిస్తూనే, టోర్నమెంట్ ప్రారంభం నుంచే ప్రతి మ్యాచ్ ప్రాముఖ్యతను పెంచేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు ఐసీసీ తెలిపింది.



## ఆదివారం ముగింపు వేడుక.. ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం..!

ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో ముగింపు వేడుకలపై నిర్వాహకులు దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ జూలై 19 ఆదివారంతో పూర్తి కానున్నందున.. అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియంలో జరుగనున్న ‘క్లోజింగ్ సెరెమొనీ’లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్, ఇంటర్నెట్ సెన్సేషన్ ‘ఐషోస్పీడీ’ సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు.

సాకర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ విజేత ఎవరో ఆదివారంతో తేలిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో, టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూ జెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది.

# 23న నే జననాయగన్ విడుదలకు రెడీ




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

-------

# ప్రభాస్ అంటే ..మాంచి భోజనం గుర్తుకొస్తుంది



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.





# అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రాకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఐకాన్ అని రాసి ఉన్న క్యాప్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఒక్క పోస్టే ప్రస్తుతం టాలీవుడ్, మాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్‌కు అభిమానులు పెట్టిన బిరుదు కావడంతో, ఈ పోస్ట్ ఆయనతో చేయబోయే సినిమాపై పరోక్షంగా ఇచ్చిన హింట్ అని నెటిజన్లు భావిస్తున్నారు. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం చాలా రోజులుగా సాగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం ఇచ్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి'తో సూపర్ హీరో జానర్‌లో తన సత్తా చాటిన బసిల్ జోసెఫ్, 'శక్తిమాన్' కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించ బోతున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలను దర్శకుడు ఇప్పటికే ఖండించారు. బన్నీతో చేయబోయేది పూర్తిగా కొత్త కథేనని స్పష్టం చేశారు. కథ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై పూర్తి స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లే ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యాక దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాతే బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అట్లీ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రం కాగా, లోకేష్ మూవీ 23వ చిత్రంగా రానుంది. బసిల్ జోసెఫ్ ప్రాజెక్ట్‌ను అల్లు అర్జున్ తన 25వ చిత్రంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.



# వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



# చరణ్ కోసం సుకుమార్ మాస్టర్ ప్లాన్..





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్‌సీ17'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రతి చిన్న విషయం కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సంచలన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ నయనతార ఓ అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.సుకుమార్ సినిమాల్లో కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా కథాగమనాన్ని మలుపు తిప్పే సహాయ పాత్రలు కూడా చాలా బలంగా, గుర్తుండిపోయేలా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే 'ఆర్‌సీ17' కోసం నయనతారకు ఒక పవర్‌ఫుల్ పాత్రను ఆయన డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె హీరోయిన్‌గా కాకుండా, కథకు వెన్నెముకగా నిలిచే పాత్రను పోషించనున్నారని సమాచారం. దక్షిణాదిలో అగ్రతారగా వెలుగొందుతున్న నయన్ ఎంట్రీతో ఈ సినిమాకు పాన్-ఇండియా స్థాయిలో మరింత బలం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఆమె నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రామ్ చరణ్ సినిమాలో కూడా ఆమె నటిస్తే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే సుకుమార్ ఈ సినిమా ఫైనల్ నెరేషన్‌ను రామ్ చరణ్‌కు వినిపించగా, ఆయన కథ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దేందుకు సుకుమార్ తన రచయితల బృందంతో కలిసి ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు తెలుస్తోంది. కథలోని భావోద్వేగాలు, పాత్రల మధ్య సంబంధాలను మరింత బలంగా తీర్చిదిద్దే పనిలో ఆయన నిమగ్నమైనట్లు సమాచారం. అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరిగితే, ఈ ఏడాది అక్టోబర్‌లో పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే 'పెద్ది' చిత్రంతో మరో బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్న రామ్ చరణ్, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. మొత్తం మీద 'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ అవుతుండటం, దానికి నయనతార లాంటి స్టార్ యాక్టర్ తోడవుతున్నారనే వార్తలు మెగా అభిమానుల్లో, సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక వివరాల కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569